క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు భరోసా

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి మరణించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ మహదేవన్ కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. కవిటి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ.. అనారోగ్యంతో మరణించిన ఏఎస్‌ఐ భాస్కరరావు, పోలాకి పీఎస్‌లో పనిచేస్తూ మరణించిన హెచ్‌సీ మహదేవన్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష చొప్పున చెక్కులను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి శివరామరాజు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు చిరస్మరణీయం


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: దేశాభివృద్ధికి విశేష కృషిచేసిన మహోన్నత వ్యక్తి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా శనివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, పేడాడ పరమేశ్వరరావు, అంబటి కృష్ణారావు, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, మంత్రి నరసింహమూర్తి, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, సురేష్, దాలినాయుడు, రెహమాన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. పూడివలసలో శనివారం పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డాక పూడివలస స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.2.02 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, సనపల నారాయణరావు, సర్పంచ్ జరుగుళ్ల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సూర వెంకటరమణపాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే చేనేత సంక్షోభం


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

లావేరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల చేనేత రంగం సంక్షోభంలోకి వెళ్లిందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. లావేరులో శనివారం వా రు చేనేత కార్మికుల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేతపై 20 శాతం జీఎస్టీ విధించడం దారుణమన్నారు. నేత కార్మికులపై భారం వేసి పవర్‌లూమ్స్‌కు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.గౌరీశంకర్, నాయకులు ఎల్.రాంబాబు, ఎ.ఈశ్వరరావు, కె.వెంకటరావు, సత్తిబాబు, శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఎచ్చెర్ల క్యాంపస్: వైశాఖి హేచరీ పరిశ్రమ యాజమాన్యం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి సురక్షిత తాగునీరు అందించాలని డి.మత్స్యలేశం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పరిశ్రమ ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కలుషితంగా మారాయని, అధికారుల స్పందించి నీటి పరీక్షలు నిర్వహించాలని కోరారు. స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

'ఓపెన్' ఫీజుల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్ చదువుతూ.. ఫెయిలైన విద్యార్థులు సప్లమెంటరీ ఫీజులను ఈ నెల 28లోగా చెల్లించాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుంతో జూన్ 2 వరకు చెల్లించవచ్చన్నారు.

ఓపెన్ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ

జి.సిగడాం: ఓపెన్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అరుణోదయ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. 45 మంది పరీక్షకు హాజరు అవ్వగా 39 మంది ఉత్తర్ణీత సాధించారు. వీరిలో 35 మంది ప్రథమ, నలుగురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని సంస్థ డైరెక్టర్ గర్లంకి శ్రీనివాసరావు శనివారం తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు


పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పొన్నాడ గ్రామ సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల ప్రకారం సంక్షేమ పథకాల లబ్ధితో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలన పోల్చి చూడాలని కోరారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ఒక్క టీడీపీ వర్గానికి మాత్రమే పథకాలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కులం, మతం, వర్గం, పార్టీ తేడా లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ నేతింటి యమున, ఎంపీటీసీలు అల్లు తులసమ్మ, పప్పల రాజేశ్వరి, నేతింటి నీలం, బోర సాయిరాం, అల్లు తులసీరావు, బొడ్డేపల్లి సుధ, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, ఉపాధి ఏపీవో శోభాదేవి, వెలుగు ఏపీఎం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

రణస్థలం: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం అర్జించవచ్చని రణస్థలం ఏడీఏ వి.శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం వ్యవసాయశాఖ కార్యాలయంలో రణస్థలం, లావేరు మండలాల రైతులకు ఆయిల్ పామ్ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సీజన్‌కుగాను ఆయిల్ పామ్ సాగుకు ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని అనుసంధానం చేసినట్లు తెలిపారు. 2022-23లో పిషిని గ్రామానికి చెందిన కె.రామరాజు 35 ఎకరాల తోటలో ఆయిల్ పామ్ సాగు వచేసి 436 టన్నుల దిగుబడి సాధించి రూ.70 లక్షలపై చిలుకు ఆదాయం పొందినట్లు వివరించారు. అనంతరం రామరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి ఎం.అనూషా, రణస్థలం, లావేరు వ్యవసాయాధికారులు డి.విజయభాస్కర్, డి.మహేష్‌నాయుడు, పతంజలి మేనేజర్ కె.రాజమోహన్, క్షేత్రస్థాయి సిబ్బంది ఎం.రమేష్, బి.నరసయ్య, ఎం.వెంకటరమణ, వై.గణేష్ పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం


పెదలింగాలవలసలో వలంటీర్లతో ప్రజాప్రతినిధులు


ఎస్ఎస్ఆర్‌పురంలో వలంటీర్లతో ప్రజాప్రతినిధులు


కొర్ని సచివాలయంలో వలంటీర్లతో నాయకులు


జగన్నాథవలసలో వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

లావేరు/ఎచ్చెర్ల క్యాంపస్/గార/జి.సిగడాం: లావేరు మండలం పెదలింగాలవలస, ఎచ్చెర్ల మండలం ఎస్ఎస్ఆర్‌పురం, గార మండలం కొర్ని, జి.సిగడాం మండలం జగన్నాథవలస సచివాలయాల పరిధిలో శనివారం వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో లావేరు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, ఎంపీడీఓ సురేష్‌కుమార్, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, గొర్లె అప్పలనాయుడు, మీసాల శ్రీనివాసరావు, గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము, పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్ బాబా, సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ, గార ఎంపీపీ గొండు రఘురాం, పీస గోపి, పీస శ్రీహరిరావు, జి.సిగడాం మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, సర్పంచులు మావిడి శ్రీనివాసరావు, బాణాన సూర్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు పెద్ది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అత్యవసర వేళల్లో అండగా నిలవాలి


ఫ్లకార్డుల ప్రదర్శనలో డీఎస్పీ, ఆస్పత్రి సిబ్బంది

శ్రీకాకుళం/క్రైమ్: అత్యవసర సమయాల్లో ప్రతి వ్యక్తి బాధ్యతతో స్పందించాలని శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలిలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజలకు అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాలు, అగ్ని ప్రమాదాలు వంటివి ఏర్పడినప్పుడు ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, డాక్టర్ బాల సూర్యప్రకాష్‌రావు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, వాహనచోదకులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన వాణి


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దువ్వాడ వాణి

శ్రీకాకుళం రూరల్: మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో శనివారం టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు దువ్వాడ వాణి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో నైపుణ్యాలు


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ

శ్రీకాకుళం అర్బన్: వేసవి విజ్ఞాన శిబిరాలు చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, ప్రతిభ వెలికితీసేందుకు ఎంతో దోహదపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఉపాధ్యాయురాలు రెడ్డి లలిత తెలుగు కథలు, ఉపాధ్యాయుడు ఎస్.సాయికృష్ణ తెలుగు వ్యాకరణం వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.వి.జి.ఎస్ శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.భానుమతి, పి.రామ్మోహన్, పి.ఈశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ


స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్న సందర్భంగా కోడి రామ్మూర్తి స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి క్రీడాకారులకు రూ.2లక్షల విలువైన ప్రత్యేక స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల 50 చోట్ల వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని, 2000 మంది తర్ఫీదు పొందుతున్నారని వివరించారు. డీఎస్ఏ సీఈవో బి.వి.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పీఈటీ అసోసియేషన్ ప్రతినిధులు వై.పోలినాయుడు, క్రీడాసంఘాల ప్రతినిధులు, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

30న ఘంటసాల నాటిక ప్రదర్శన


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీసుమిత్రా కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్ర నాటకాన్ని ఈ నెల 30న సాయంత్రం బాపూజీ కళామందిర్‌లో ప్రదర్శిస్తున్నట్లు శ్రీసుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ మేరకు నగరంలోని అవోపా కల్యాణ మండపంలో శనివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులు ప్రదర్శన ఇస్తారని తెలిపారు. భాస్కరుని సత్య జగదీష్ రచించిన ఈ నాటికకు దర్శకత్వం కూడా ఆయనే వహిస్తారని పేర్కొన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు మండవిల్లి రవి, నక్క శంకరరావు, కె.మురళీ, కిల్లాన ఫల్గుణరావు, డి.పార్థసారథి, వి.వి.ఆర్.మూర్తి, మల్లె మొగ్గల రాజు, తిమ్మరాజు నీరజ, ఎం.కృష్ణ, పీఏఎస్ శాస్త్రి, మెట్ట పోలినాయుడు పాల్గొన్నారు.

ఈఎస్ఐ భవన నిర్మాణం పూర్తి చేయాలి

రణస్థలం: పైడిభీమవరంలో నిర్మిస్తున్న ఈఎస్ఐ 10 పడకల డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం సత్వరమే పూర్తిచేసి కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని, లోకల్ పే ఆఫీసు ఏర్పాటు చేయాలని, రిఫరల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పైడిభీమవరం ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ముప్పైవేల మంది కార్మికులు ఉన్నా ఈఎస్ఐ 30 పడకల ఆసుపత్రి లేకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, బి.సురేష్, రమేష్, కె.అచ్చెన్నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

ఉదయాన్నే ఉపాధి పనులు


ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

రణస్థలం: రోజుకు కనీసం ఆరు గంటలకు తక్కువ కాకుండా పని చేస్తే రూ.250 నుంచి రూ.272 వరకు వేతనం గిట్టుబాటు అవుతుందని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. పిసిని పంచాయతీలో నెలివాడ ఈదల చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉదయం 6.30 నుంచి 10గంటలకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 గంటలకు పని చేయాలని సూచించారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎం.శ్రీనివాసనాయుడు, జేఈలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు


జె.ఆర్.పురం ఎస్ఐ రాజేష్


ఎచ్చెర్ల ఎస్ఐ సత్యనారాయణ


రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్


ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్


టూటౌన్ సీఐ పప్పల శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మిస్సింగ్ కేసుల ఛేదన, పెండింగ్ కేసుల పరిష్కారం, కేసుల రాజీలు, ఎం.వి. జరిమానాలు వంటి అంశాల్లో ప్రతిభ చూపిన వారికి ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ, కాశీబుగ్గ సీఐలు పప్పల శ్రీనివాసరావు, శ్రీనివాసరావులు, ఎస్ఐలు బలివాడ గణేష్ (శ్రీకాకుళం ఒకటో పట్టణ), విజయ్‌కుమార్ (శ్రీకాకుళం రూరల్), సత్యనారాయణ (ఎచ్చెర్ల), గోవిందరావు (కొత్తూరు), కృష్ణ (ఆమదాలవలస), బి.సత్యనారాయణ (బారువ), ఎల్.రామకృష్ణ (టెక్కలి), రాజేష్ (జె.ఆర్.పురం), అహ్మద్ ఆలీ (నందిగాం) ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహించి కాకినాడ పోలీసు కార్యాలయం పరిపాలనాధికారిగా బదిలీపై వెళ్తున్న ఎం.శివరామరాజు సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.